


కేంద్ర సహాయ మంత్రి వర్మకు పితృవియోగం

నేడు బలుసుముడిలో అంత్యక్రియలు



భీమవరం : కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు పితృ వియోగం కలిగింది. తండ్రి భూపతి రాజు సూర్యనారాయణ రాజు గత కొంత కాలం నుంచి అనారోగ్యానికి గురయ్యారు. హైదారాబాద్ లో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సూర్య నారాయణ రాజు(91) గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య సీత, కుమారుడు కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, మరో ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సూర్య నారాయణరాజు సాంఘిక సంక్షేమ శాఖలో జిల్లా అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. సూర్యనారాయణ రాజు భౌతిక కాయన్ని శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి స్వగృహంలో సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం భీమవరం టూ టౌన్ పరిధిలోని బలుసు ముడి మోక్ష దానంలో మధ్యాహ్నం ఒంటిగంటకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

సర్వజన ఆసుపత్రిలో

సవాలక్ష కష్టాలు..!

ఆంక్షల పేరుతో రోగులకు తీవ్ర ఇబ్బందులు

ఆసుపత్రి అధికారిని కలవాలంటే యుద్ధమే

గుండె, కిడ్నీ బాధితులకు అందని వైద్యం

వైద్యవిధాన పరిషత్‌లోని ఐదుగురు డాక్టర్లు బదిలీ

న్యూరోసర్జన్ కూడా లేకపోతే వైద్యం ఎలా..?

ఆసుపత్రి నిధులు గోల్‌మాల్‌పై విచారణ జరిగేనా?



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది' అనే చందంగా ఏలూరు సర్వజన ఆసుపత్రిలో సవాలక్ష కష్టాలు అన్నట్లు పరిస్థితులు తయారయ్యాయి. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు వైద్యసేవలు అందించడంలో అందరి మన్ననలను పొందగా, ప్రస్తుతం దానికి భిన్నంగా వైద్యసేవలు సక్రమంగా అందని దుస్థితి నెలకొంది. సూపరింటెంట్‌లుగా బాధ్యత వహిస్తున్న అధికారుల పర్యవేక్షణాలోపం, అందుబాటులో ఉండకపోవడమే దీనికి కారణమనే విమర్శలు విన్పిస్తున్నాయి. సాధారణ రోగులు తమ సమస్యలు చెప్పుకోవడానికి వారిని కలిసే అవకాశమే లేకుండా పోతుందని చెబుతున్నారు. సూపరింటెండెంటను కలవాలంటే గంటలు తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు ఉండటంతో అంతా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. అక్కడ పనిచేసే సిబ్బంది సైతం రోగులకు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండటం తీవ్రంగా బాధిస్తోంది. రోగులకు సేవలందించాల్సిన అధికారులు తమ అధికార దర్పం చూపించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కావడం లేదనే చర్చ సాగుతోంది. జిల్లా ఆసుపత్రి కాస్త మెడికల్ కాలేజీ, టీచింగ్ ఆసుపత్రిగా మారడంతో రోగులకు మరిన్ని వైద్యసేవలు అందుతాయని అంతా భావించారు. పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఏలూరు సర్వజన ఆసుపత్రికి ఏలూరు జిల్లాతోపాటు, పశ్చిమగోదావరి, విభజిత తూర్పుగోదావరి జిల్లాల నుంచి సైతం రోగులు వస్తుంటారు. ప్రతిరోజూ వెయ్యి మంది వరకూ రోగులు ఓపి సేవలు పొందుతుంటారు. వందల సంఖ్యలో ఇన్‌పేషెంట్ సేవలు అందుకునే రోగులు ఉన్నారు. సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాత బాధ్యతలు స్వీకరించిన అధికారి ఆసుపత్రి లోపల ఆవరణలో అడ్డుకట్టలు వేయించి రోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పరిస్థితి ఉంది. అదేమని అడిగితే పొంతనలేని కారణాలు చెప్పిన పరిస్థితి. వెహికల్ పార్కింగ్ పేరుతో రోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గతంలో ఎటువంటి ఇబ్బందీ లేకుండా సాగిన వాహనాల పార్కింగ్ విషయంలో అనేక ఆంక్షలు తెరపైకి తెచ్చి అంతా అస్తవ్యస్తం చేశారు. సదరు శిబిరం నిర్వహించే రోజున అక్కడకు వస్తున్న వారికి తాగునీరు వంటి ఏర్పాట్లు కూడా ఉండటం లేదు. దీంతో రోగులు, వారికోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సమస్యలే ఉన్నాయి.

గుండె, కిడ్నీ రోగుల పరిస్థితి అయోమయం

సర్వజన ఆసుపత్రిగా మారిన తర్వాతసైతం స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో లేని పరిస్థితి ఉంది. గుండె, కిడ్నీ రోగులకు ఇక్కడ వైద్యం అందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యధికంగా చుట్టుముడుతున్న రోగాల్లో గుండె, కిడ్నీ సమస్యలే అధికంగా ఉంటున్నాయి. అందుకు సంబంధించిన వైద్య సేవలు మాత్రం అందుబాటులో లేకుండాపోయాయి. ఇప్పుడు న్యూరో సేవలకు సైతం ఇబ్బంది ఏర్పడే పరిస్థితి నెలకొంది. వైద్యవిధాన పరిషత్ నుంచి పని చేస్తున్న ఐదుగురు సీనియర్ డాక్టర్లను బదిలీ చేశారు. వీరిలో న్యూరోసర్జన్, కంటి డాక్టర్, గైనకాలజిస్ట్, పిల్లల వైద్యులు, అత్యవసర సేవలు చూసే డాక్టర్ ఉన్నారు. న్యూరోసర్జన్‌ను బదిలీ చేయడంతో తల, నరాలకు సంబంధించిన సమస్యలు వస్తే వైద్యసేవలకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉంది. ఆయన స్థానంలో మరో న్యూరోసర్జన్‌ను నియమిస్తారో.. లేదో కూడా తెలియని పరిస్థితి. సీనియర్ వైద్యులు ఉండటంతో ఇప్పటి వరకూ వైద్యసేవలు కొంతమేర ఇబ్బంది లేకుండా ఉన్నాయి. ఇప్పుడు రోగులు మరిన్ని ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుందని చర్చ సాగుతోంది.

అవినీతి ఆరోపణలపై విచారణ సాగేనా..?

ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగినట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. గతంలో పనిచేసిన అధికారి ఎసిల ఏర్పాటులో ఇష్టానుసారంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. దాదాపు రూ.2.50 కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని విచారణ జరిపించాలనే డిమాండ్ వినిపిస్తోంది. దీనిపై విచారణ జరుగుతుందో, లేదో వేచిచూడాలి.

సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

సాగునీటి సలహా మండలి సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రానున్న రబీ సీజన్‌లో సాగునీటికి, వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో గురువారం జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో రానున్న రబీ సీజన్‌లో పశ్చిమ డెల్టా ఆయకట్టు పరిధిలో 82,251 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రబీ సీజన్‌లో గోదావరి పశ్చిమ డెల్టా ఆయకట్టుకు, జిల్లాలో తాగునీటి అవసరాలకు 91.35 టిఎంసిలు అవసరమవుతాయని, 68.40 టిఎంసిలు లభ్యత ఉంటుందని అంచనా వేశామని, మిగిలిన నీటిని సీలేరు, ఇతర నీటి వనరుల ద్వారా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. రబీకి సాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని పక్కాగా అమలు చేయాలన్నారు. పశ్చిమ డెల్టా ఆయకట్టు పరిధిలోని కాల్వలకు వచ్చే ఏప్రిల్ 15న కాలువలు మూసివేయాలని, తిరిగి జూన్ ఒకటో తేదీన కాలువలకు నీటిని విడుదల చేయాలని సమావేశం తీర్మానించిందన్నారు. గోదావరిలో నీటి లభ్యత అనుసరించి పోలవరం, గూటాల, ఎర్రకాలువ ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు విడుదల చేస్తామన్నారు. జిల్లాలో ఇటీవల వరదల కారణంగా నూజివీడు, పెద్దవేగి, బుడమేరు పొంగిపొర్లడంతో జనజీవనం అస్తవ్యస్తమైందని, దీనిదృష్ట్యా మైనర్, మేజర్ నీటి వనరులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా బలివే క్షేత్రానికి తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్ట్ నుండి 50 ఎంసిఎఫ్‌టి నీటిని ఐదు రోజులపాటు సరఫరా చేయాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ దేవప్రకాష్, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ త్రినాథబాబు, మత్స్య శాఖ జెడి నాగలింగాచార్యులు, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అస్వస్థతకు గురైన 9 మంది చిన్నారులు క్షేమం

సకాలంలో స్పందించిన జిల్లా యంత్రాంగం

ఘటనపై కొనసాగుతున్న విచారణ



పిల్లలతో మాట్లాడుతున్న డిఇఒ వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు మండలం గోపన్నపాలెం ఎంపిపి పాఠశాలలో బుధవారం స్వల్ప అస్వస్థతకు గురైన తొమ్మిది మంది చిన్నారులు క్షేమంగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ తెలిపారు. సంఘటన జరిగిన సమాచారం తెలియగానే జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. సంఘటన వివరాలు తెలిసిన వెంటనే జిల్లా వైద్య అధికారి డాక్టర్ శర్మిష్ట, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ సుమతి, డిఇఒ వెంకటలక్ష్మమ్మ బాలికలకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. తొలుత బాలికలకు గోపన్నపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. అనంతరం వారికి మరింత మెరుగైన వైద్య సేవలందించడానికి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే గోపన్నపాలెం ఆరోగ్య కేంద్రంలో బాలికలను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పరామర్శించి వారికి మరింత మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోమని ఆదేశించారు. ఈ సంఘటనపై ఇప్పటికే ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయరాలికి షోకాజ్ నోటీస్ కూడా జారీ చేసినట్లు డిఇఒ వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతుందని, విచారణ పూర్తిచేసిన వెంటనే జిల్లా కలెక్టర్ వారికి నివేదిక సమర్పిస్తామని డిఇఒ తెలిపారు.

13 నుంచి బుట్టాయగూడెంలో సిపిఎం జిల్లా మహాసభ

కరపత్రాలు ఆవిష్కరించిన జిల్లా నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న రవి, నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం జిల్లా 26వ మహాసభ డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో జరగనున్నాయని, ఈ మహాసభను జిల్లా ప్రజలు, ఏజెన్సీవాసులు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్‌తో కలిసి మాట్లాడారు. రవి మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే మహాసభ నేపథ్యంలో వచ్చే నెల 13, 14, 15 తేదీల్లో 26వ జిల్లా మహాసభ జిల్లాలో భూపోరాటాలకు నిలయమైన బుట్టాయగూడెంలో జరగనున్నాయని తెలిపారు. 13న బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తామని, 14, 15 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని వివరించారు. వీటికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారాం, ఇతర నాయకులు విచ్చేస్తారని తెలిపారు. ఈ మహాసభలో జిల్లాలో సిపిఎం గత మూడేళ్లలో సాగించిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు తదితర అంశాలపై సమీక్షించుకుని భవిష్యత్తు ప్రణాళిక, కర్తవ్యాలను రూపొందించుకుంటామన్నారు. జిల్లాలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా సిపిఎం జిల్లా సమగ్రాభివృద్ధిపై జిల్లా సదస్సును ఏలూరులో నిర్వహించిందని, ఆ సదస్సులో జిల్లాలోని వనరులు, వాటిని ఉపయోగించుకుంటే సాగే జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం గూర్చి ప్రణాళికాబద్ధంగా వివరించామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏలూరు జిల్లా అభివృద్ధి మాత్రం ముందుకు సాగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సిపిఎం జిల్లా మహాసభలో కేవలం ప్రజా సమస్యలపై పోరాటాలే కాకుండా, జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వాలపై ఒత్తిడి చేసేలా ప్రణాళిక రూపొందిస్తుందని ప్రకటించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోవాలన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లను అర్హులందరికీ అందించాలని, ఉచిత ఇసుకను సమర్థవంతంగా అమలు చేయాలని, మద్యం పాలసీలో మార్పులు చేసి మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకించి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని కూటమి కొనసాగించడం తగదన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను తొలగించాలని, ట్రూఅప్ విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భారాలు చాలవన్నట్లు అంతర్గత రోడ్లపై టోల్‌ఛార్జీలు వసూలు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ప్రకటించారు. ప్రభుత్వం శాంతి భద్రతలు కాపాడాలని, మహిళలకు రక్షణ కల్పించాలని కోరారు.

సిగ్నల్ పాయింట్ క్రమబద్ధీకరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో పాత బస్టాండ్ వద్ద ఉన్న సిగ్నల్ పాయింట్ క్రమబద్ధీకరించాలని కోరుతూ ఏలూరు ట్రాఫిక్ సిఐ ఎస్.లక్ష్మణరావుకు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ తరపున చక్రాల అమర్‌కుమార్, జె.గోపీ, అడ్డాల రాజు (నాని) వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి గోపీ మాట్లాడుతూ పాత బస్టాండ్ వద్ద ఉన్న సిగ్నల్ పాయింట్ జీబ్రా లైన్, స్టాప్ లైన్ మధ్య దూరం దాదాపు 20 మీటర్లు ఉండడంతో వాహనదారులు గమనించకుండా ఇ-చలానాలకు బలైపోతున్నారని తెలిపారు. పాత బస్టాండ్ సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న జీబ్రా లైన్, స్టాప్ లైన్, సీసీ కెమెరాలు క్రమబద్ధీకరించి వాహనదారులకు ఇ-చలానాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. నగరంలో దాదాపు ఆరు వేల ఆటో డ్రైవర్లు ఇ-చలానాలు బాధితులుగా ఉన్నారన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తెలంగాణ తరహాలో ఇ-చలానాలకు వన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా నామమాత్రపు రుసుముకు ఇ-చలానాలను రద్దు పరచాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ట్రాఫిక్ సిఐ ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి పోరుకు సన్నద్ధం

కోడ్ ఉల్లంఘించకుండా ప్రత్యేక కేంద్రీకరణ

ఓటర్లను ప్రభావితం చేసే చర్యలపై నిఘా

అధికారులకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశం




మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు: జిల్లాలో డిసెంబర్ ఐదో తేదీన నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు హాలులో గురువారం ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లపై ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్‌తో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలు జిల్లాలోని 20 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 9న జరుగుతుందని, 12వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు. కోడ్ సమయంలో జిల్లాలో ఎక్కడా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరగకుండా అధికారులు చూడాలన్నారు. జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు 2,605 మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ ఐదో తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 144 మంది సిబ్బందిని నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్నింటిలోనూ కనీస వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణ, భద్రతా చర్యలపై సంబంధిత తహశీల్దార్లు తమ పరిధిలో సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఓటర్లను ప్రలోభపర్చే చర్యలు ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా ఓటర్లను ప్రలోభపర్చే చర్యలను గుర్తిస్తే వెంటనే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పోలింగ్‌నకు 48 గంటల ముందు నుండి మద్యం అమ్మకాలు నిలిపివేయాలన్నారు. జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎటువంటి సమస్యా రాకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. గత పదేళ్లలో ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు సమస్యలు సృష్టించిన వారిని గుర్తించి, వారి కదలికలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, వాణి, ఎంవి.రమణ, ఎల్‌డిఎం నీలాద్రి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, డిపిఒ అనురాధ పాల్గొన్నారు.

23న వంకవారిగూడెంలో అఖిలపక్షం

జీలుగుమిల్లి : వంకవారిగూడెం పంచాయతీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒంటెద్దు పోకడ నిర్ణయాలతో తలపెట్టనున్న నేవీ ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఈ నెల 23న శనివారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ పార్టీలకు అతీతంగా రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బొర్రంపాలెంలో డిఎల్‌పిఒ విచారణ



విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం పంచాయతీలో అవకతవకలపై జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ గురువారం విచారణ చేపట్టారు. బొర్రంపాలెం గ్రామపంచాయతీలో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, సర్పంచి, కార్యదర్శి లక్షల రూపాయలు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని, విచారణ చేయాలని గ్రామానికి చెందిన సామాజిక వేత్త గుండె పాండురంగ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు డిపిఒ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ స్థానిక సచివాలయంలో ఫిర్యాదుదారుడు, సర్పంచి, పూర్వ కార్యదర్శులను విచారించారు. ఫిర్యాదులో అంశాలను చదివి వినిపించారు. పంచాయతీలో జరిగిన పనులు, చెల్లింపులన్నింటినీ పూర్తి విచారణ చేపట్టేందుకు విచారణ కమిటీని నియమిస్తామని, అనంతరం నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. ఆక్రమణకు గురైన వాటర్ ట్యాంక్ స్థానంలో సర్వే చేయించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.

పోలవరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పూర్తి చేయాలి

సిపిఎం మండల మహాసభలో నాయకులు

మండల కార్యదర్శిగా కారం భాస్కర్



ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండల కేంద్రంలో ఉన్న సామజిక ఆరోగ్య కేంద్రం వద్ద గత ప్రభుత్వం ప్రారంభించిన పోలవరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం మండల ఐదో మహాసభలో పలు తీర్మానాలను ఆయన గురువారం ప్రకటనలో తెలిపారు. పోలవరం మండల కేంద్రంలో గత ప్రభుత్వం చేపట్టిన పోలవరం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, మండల ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. మండల కేంద్రం పోలవరం నుంచి బోడిగూడెం మీదుగా రేపల్లెవాడ, దొండపూడి నుంచి కుంకాల, పేడ్రాల వరకు, చింతపల్లి నుంచి గెడ్డపల్లి వరకు ప్రధాన రహదారులు పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌టిఆర్, 1/70 చట్టాల ప్రకారం వేల ఎకరాలు గిరిజన భూములు అన్యాక్రాంతంగా గిరిజనేతరులు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు జిఒ-3కు చట్టభద్రత కల్పించి స్థానిక గిరిజనులకే ఉద్యోగం కల్పించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే మెగా డిఎస్‌సితో కాకుండా ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సిని ప్రకటించాలని పేర్కొన్నారు.

సిపిఎం నూతన మండల కమిటీ ఎన్నిక

సిపిఎం మండల ఐదో మహాసభలో పది మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. మండల కార్యదర్శిగా కారం భాస్కర్, కమిటీ సభ్యులుగా బొరగం భూచంద్రరావు, తామ బాలరాజు, పి.ప్రగతి, ఎస్.సాయికృష్ణ, ఎం.చలపతిరావు, పి.లక్ష్మీకుమారి, టి.శాంతి, గోకూరి పాండవులు, కె.పోసిరత్నం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సిపిఎం ఆగిరిపల్లి మండల కన్వీనర్‌గా శివనాగరాజు



ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిపిఎం ఆగిరిపల్లి కమిటీ కన్వీనర్‌గా చాకిరి శివనాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆగిరిపల్లిలోని సీతారాం ఏచూరి ప్రాంగణంలో నిర్వహించిన మండల మహాసభలో సిపిఎం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చాకిరి శివనాగరాజు, కమిటీ సభ్యులుగా నైనవరపు ఊశక్కయ్య, ఈపూరి రవీంద్ర, ముల్లంగి సుభాకరరావు, ముత్యాల నరేష్, జంగం శౌరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను తగ్గించాలని, లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టం పని దినాలను పెంచాలని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని, అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని పలు తీర్మానాలను చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, నాయకులు ఎఆర్.హనుమాన్లు, సత్తు కోటేశ్వరరావు, గంటా పాపారావు, షేక్ జహాంగీర్ బాషా, జలసూత్రం గోపాలరావు, నెక్కలపు శివ శంకర్, పి.తాతారావు, స్టాలిన్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతో ఆరోగ్యకర సమాజం

జిల్లా మలేరియా అధికారి ప్రసాద్



ఆరోగ్య కేంద్రంలో జిల్లా మలేరియా అధికారి

ప్రజాశక్తి - మండవల్లి

దోమల నిర్మూలనతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని జిల్లా మలేరియా అధికారి సిఎస్ఎస్.ప్రసాద్ స్పష్టం చేశారు. మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. రక్త పరీక్ష కేంద్రంలో జరుగుతున్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియాను నిర్మూలించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్, సున్నం, ఎబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. శుక్రవారం నిర్వహించే డ్రైడేను సమర్థవంతంగా నిర్వహించి, మురుగునీటి నిల్వల వల్ల సంభవించే నష్టాలపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం లింగాల సచివాలయ పరిధిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సుమ, ఎస్ఇ శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రాయితీ బకాయిలు చెల్లించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆయిల్‌పామ్, కోకో తదితర మొక్కలు, డ్రిప్ పండిళ్లు, ఇతర ఉద్యాన పంటల రాయితీ బకాయిలు, నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేసి రైతులకు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఏలూరులోని జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరం హాలులో ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డిడి) ఎస్.రామ్మోహన్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులు అధిక దిగుబడులు వచ్చే ఆయిల్ పామ్ విత్తనాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆయిల్ పామ్ మొక్కల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యాన పంటల రైతులు పాల్గొన్నారు.

6,372 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6,372 క్యూసెక్కుల నీరు పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు గురువారం తెలిపారు. 18 మోటార్లు 18 పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు నేరేడుమిల్లి గ్రామానికి చెందిన వెలకల సత్యనారాయణరాజు గురువారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యానికి అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్స్, స్వామి వారి ప్రసాదాలు అందించారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలో ఉన్న కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో కొనసాగుతున్న డాక్టర్ ఎంఆర్.అప్పారావు పీజీ సెంటర్‌లో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నవీనలావణ్యలత, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి ఎసికె అన్నపూర్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ, సీనియర్ జర్నలిస్ట్ వెంకటేశ్వర్లు (వెంకట్) పాల్గొన్నారు.

'క్రైస్తవులకిచ్చిన హామీలు నెరవేర్చిన చంద్రబాబు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

క్రైస్తవులకు ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు నెరవేర్చినందుకు టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం సునీల్ దేవ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. నూజివీడు పట్టణంలో ఆయన గురువారం మాట్లాడుతూ క్రైస్తవులకు రూ.150 కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం అభినందనీయమన్నారు. క్రిస్టియన్ భవనాలకు రూ.50 కోట్లు, శ్మశాన వాటికలకు ప్రహరీలకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. వివాహం జరిపే సర్టిఫికెట్లు మూడు నుంచి పదేళ్ల కాల పరిమితిగా పాస్టర్లకు అవకాశం కల్పించడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. క్రైస్తవుల ఆర్థిక పురోభివృద్ధి కోసం కృషి చేస్తున్న కూటమి పాలనను ఎన్నటికీ మరువలేమన్నారు. చంద్రబాబు నాయకత్వంలో క్రైస్తవులకు, దళిత వాడల అభివృద్ధి వేగవంతంగా కొనసాగుతోందని, అందుకోసం బృహత్తరమైన ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వివరించారు.

నేరాలు - ఘోరాలు

ఇద్దరు చోరులు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని భీమడోలు సర్కిల్ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. వీరి బారి నుంచి దొంగతనాలు కదిలినట్లు ఒక కేసులో వీరిని అరెస్ట్ చేయగా వీరు చేసిన నేరాల చిట్టా బయటపడింది. ఏలూరు నగరంలోని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన ఆలూరు శాంత కుమారికు ద్వారకాతిరుమల మండలంలోని చెందిన మహిళతో వివాహమైంది. ఈ క్రమంలో గత నెల 25వ తేదీన తన భార్య వద్దకు వెళ్లేందుకు శాంత కుమార్ చిన్నయగూడెం నుంచి ద్వారకాతిరుమల బయలుదేరాడు. మార్గమధ్యంలో కప్పలగుంట గ్రామ సమీపంలో కల్వర్టు వద్ద ఆగి మూత్ర విసర్జన చేస్తున్నాడు. ఈ సమయంలో కల్వర్టు వెనుక భాగం నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతడిని తాళ్లతో కట్టేసేసి అతని వద్ద ఉన్న రూ.20వేల నగదు, సెల్‌ఫోన్, బంగారు ఉంగరాలను అపహరించుకుని అతని పాదల్లో తోసేసి పారిపోయారు. శాంతకుమార్ ద్వారకాతిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా భీమడోలు సిఐ విల్సన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి దోచుకున్న పట్టుకున్నారు. వారిని విచారణ చేస్తున్న సమయంలో అంతర్ రాష్ట్ర పరిధిలో పలు రహదారి దోపిడీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి పలు కేసులకు సంబంధించిన 32 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.వడ వేల నగదును, ఒక ద్విచక్ర వాహనాన్ని, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. రాజమండ్రి ప్రాంతంలోని కొంతమూరు జంగాల కాలనీకి చెందిన మాలిపాటి విజయ్‌కుమార్, అతని స్నేహితుడైన రాజమండ్రి ప్రాంతం చింతల నామవరం ప్రాంతానికి చెందిన దామిరెడ్డి త్రిమూర్తులను అరెస్టు చేశామని డిఎస్‌పి తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఫోన్ మాట్లాడవద్దని చెప్పినందుకు ఓ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు ఆశోకనగర్ చెందిన ఒక యువతి (19) ఏలూరులోని ఒక మార్ట్‌లో పనిచేస్తూ తరచూ ఇంటికి వచ్చినప్పటి నుంచి ఫోన్లు మాట్లాడుతుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆ మార్ట్‌లో పని మాన్పించారు. ఇంటి వద్ద ఫోన్లు మాట్లాడవద్దని చెప్పడంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ఉంగుటూరు :ఉంగుటూరులో గృహ అవసరాలకు వాడాల్సిన వంట గ్యాస్ సిలిండర్లను, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న ఆరు సిలిండర్లను సీజ్ చేశారు. ఉంగుటూరులో సత్య టిఫిన్ సెంటర్‌లో తనిఖీ చేసి అక్రమంగా వినియోగిస్తున్న ఆరు సిలిండర్లు స్వాధీనం చేసుకున్నామని విజిలెన్స్ తహశీల్దార్ కన్యాకుమారి వెల్లడించారు. ఉంగుటూరు మండల సివిల్ సప్లై డిటి కొల్లూరి వెంకటసుబ్బారావు, వీఆర్ఒ కుప్పు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. టిఫిన్ సెంటర్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సిఎస్ డిటి వెల్లడించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధి మండలంలోని కంచనగూడెం శివారు అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కంచనగూడెం గ్రామానికి చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని సారా స్వాధీనం చేసుకుని, 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా వ్యాపారులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడిలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మేడూరు బన్నీ అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలోని శివపురం గ్రామంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పాత కేసులో నిందితుడు గుత్తా వెంకటేశ్వరరావును 129 బిఎన్ఎస్ఎస్ చట్ట ప్రకారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ తహశీల్దార్ చింతలపూడి వారి ఎదుట హాజరు పరచి బైండోవర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, ఏఎస్ఐ ఎం.ఎస్.ఆర్, సిబ్బంది పాల్గొన్నారు.

1800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు :జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ సిఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో మండల పరిధిలోని వేలేరు ఫారెస్ట్ ఏరియాలో ఎక్సైజ్ ఎస్ఐ జి.వెంకటలక్ష్మి, సుబ్రహ్మణ్యం గురువారం దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐలు తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు కె.అప్పారావు, బి.సురేష్, ఎం.సంతోష్‌కుమార్, కె.ధర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో 20 శాతం వృద్ధి రేటు సాధించాలి

పామాయిల్ సాగు విస్తీర్ణం మరింత పెంచాలి

రైతులకు అన్ని విధాలా ప్రోత్సాహం: కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఉద్యాన సాగులో 20 శాతం వృద్ధిరేటు సాధించడానికి రైతులను అన్నివిధాలా ప్రోత్సాహాన్ని అందిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ హాలులో గురువారం సుస్థిర ఆయిల్‌పామ్ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి జిల్లాలో ఆయిల్‌పామ్, ఇతర ఉద్యాన పంటల వృద్ధిపై రైతు సమస్యలు, ప్రభుత్వ ప్రోత్సాహంపై రైతులకు అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ ఉత్పత్తిలో మన జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, జిల్లాలో 1.16 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతుందని తెలిపారు. పామాయిల్‌ను దిగుమతి చేసుకునే స్థాయి నుండి ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లేందుకు రైతులు కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు నీటిలభ్యత, వాతావరణం, భూసారం వంటి అనుకూల అంశాలు ఉన్నాయని, వీటిని ఉపయోగించుకుని మరింత అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగు 40 సంవత్సరాలకుపైగా ఉంటుందని, రైతులకు ఇది దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే పంటని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో కోకో, బ్లాక్ పెప్పర్ వంటి అంతర పంటలు సాగు ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించొచ్చన్నారు. ఉద్యాన రైతులకు సాగులో యాంత్రీకరణతోపాటు డ్రిప్, మైక్రో ఇరిగేషన్ వంటి ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ పరిశోధనాలయం మన జిల్లాలో ఉండడం, జిల్లాలో అధిక దిగుబడి సాధకులు శాస్త్రవేత్తల సూచనలు కూడా కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తెలిపిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ పాటిస్తూ అధిక దిగుబడి సాగిస్తున్నారన్నారు. సాగులో సూక్ష్మ డ్రిప్ సేద్య విధానానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అనంతరం



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఆయిల్‌పామ్ అధిక దిగుబడి సాధనకు కృషి చేసిన రైతులు, శాస్త్రవేత్తలను సన్మానించి మెమొంటోలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ హిమాంశు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి రవికుమార్, ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, శాస్త్రవేత్తలు టి.సుశీల, ఎవి.ప్రసాద్, పి.మాధవీలత, గోవర్ధన్, ఎన్‌వివి.చలపతిరావు, గోద్రెజ్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.మురళీధర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యానవనాల పెంపకం, డ్రిప్, మైక్రో ఇరిగేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు వంటి అంశాలపై ఉద్యాన, మైక్రో ఇరిగేషన్ శాఖలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ పరిశీలించారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

ప్రతిఒక్కరూ ఎస్‌సి, ఎస్‌టి చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మెడియం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కన్నాపురం జంక్షన్ వద్ద ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) ఆధ్వర్యంలో ఎస్‌సి, ఎస్‌టి చట్టంపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రామమోహన్‌ద్రరావు రీజనల్ సిఐడి డిఎస్‌పి వై.శ్రీనివాసరావు, జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ అడ్వకేట్ సొబ్బన ఆనందరావు, డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సిఐ బాల సురేష్ బాబు, ఎంపిడిఓ సిహెచ్.శ్రీనివాస్, తహశీల్దార్ సాయిరాజు, పవన్ కుమార్ మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి చట్టంపై అన్‌లైన్ పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చినవారికి సర్టిఫికెట్లు, మెమొంటోలు అందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.రవీంద్ర తెలిపారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఛైర్మన్ భావిశెట్టి వీరయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 45 రోజుల బేసిక్స్ ఆన్ కంప్యూటర్స్ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నారాయణపురం చుట్టుపక్కల గ్రామాల్లో చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న యువతి యువకులకు ఉచితంగా 45 రోజుల సర్టిఫికెట్ కోర్సును సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రారంభించారు. గ్రామ ప్రాంతాల నుంచి విశేషమైన స్పందన లభించింది. పరిసర గ్రామాలకు చెందిన వంద మందికి పైగా అభ్యర్థులు పేర్లను నమోదు చేసుకోగా రెండు బ్యాచ్‌లుగా ఉచితంగా కంప్యూటర్ కోర్సులో తర్ఫీదు ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాదరావు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి బేసిక్స్ ఆన్ కంప్యూటర్ కోర్స్ 45 రోజుల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9491175498, 9866355120 సంప్రదించాలని తెలిపారు.

సైబర్ నేరగాళ్లకు సహాయం చేస్తే కఠిన చర్యలు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సైబర్ నేరాల్లో కొంతమంది ప్రయివేట్ బ్యాంకుల్లో పనిచేసే సిబ్బంది హస్తం ఉందని విచారణలో తెలుస్తుందని, ఎవరైనా సైబర్ నేరగాళ్లకు సహాయం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ బ్యాంకు సిబ్బందిని హెచ్చరించారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం స్థానికంగా ఉన్న ప్రయివేట్ బ్యాంకు అధికారులతో, సిబ్బందితో ఎస్‌పి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సైబర్ నేరాల పట్ల అవగాహన, వాటి నివారణ వంటి అంశాలపై వారితో చర్చించారు. బ్యాంకులో ఖాతాలను తెరిచేందుకు వచ్చే వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా ఖాతాదారులు సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం ఇస్తే పోలీసులు వెంటనే వారికి సహాయం అందిస్తారని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు రుణాలు ఇచ్చేందుకు చర్యలు

మేయర్ షేక్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణ విషయంలో కార్పొరేషన్ పరంగా అన్నివిధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. వారి అప్పులు, ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వారికి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు బ్యాంకర్లతో మాట్లాడనున్నట్లు చెప్పారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులకు రెండు జతల దుస్తులు అందించారు. రెండు కొత్త ట్రాక్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలందిస్తూ స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.13 లక్షలతో కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లను ప్రారంభించామన్నారు. కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ ఆసుపత్రిలో ఉచిత వైద్య చికిత్సలు పొందేందుకు సుమారు 600 మందికి ఇఎస్ఐ కార్డులు అందిస్తున్నామన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని ముసునూరు, గోపవరం గ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

సచివాలయంలో ఆధార్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌కు ఎదురుగా ఉన్న సచివాలయంలో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎంపిడిఓ జి.రాణి తెలిపారు. ఆపార్ ఐడి క్రియేట్ చేసుకోవడానికి, ఆధార్‌లో కరెక్షన్లు చేసుకోవాల్సిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగాన్ని ప్రతిఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్.ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గంజాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గన్నవరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు, పి.రంగారావు, ఎస్.పెద్దిరాజు, జి.లక్ష్మీ, బి.ప్రభు, పి.రాజేష్, జి.సవిన్ పాల్గొన్నారు.

పని సర్దుబాటు వద్దు

ఎపిటిఎఫ్ 1938

ఏలూరు అర్బన్ : తరచూ పని సర్దుబాటు చేయడంతో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఆందోళనకు, గందరగోళానికి గురవుతున్నారని ఎపిటిఎఫ్ 1938 రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నంబాబు, జి.మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో విద్యా సంవత్సరం మధ్యలో విద్యార్థుల నమోదు హెచ్చుతగ్గులతో పలు సమస్యలు ఎదుర్కోవాల్సి ఉందని తెలిపారు.

30 వరకు చైతన్య సభలు

ప్రజాశక్తి - ఏలూరు

దేశభక్తి - భారత రాజ్యాంగం పేరుతో 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 12 రోజులు చైతన్య సభలను హేలాపురి బాలోత్సవం, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, బహుజన ఆఫీసర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్, భారత బచావో తదుపరి నిర్వహిస్తున్నారు. మూడోరోజు గురువారం సివి.రామన్ 54వ వర్ధంతి గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లోనూ, ఎఆర్‌డిజికె మున్సిపల్ హైస్కూల్లో కమిటీ నాయకులు నిర్వహించారు. ఆ సంపూర్ణ ప్రతినిధులు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, ప్రెస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు, భారత బచావో రాంబాబు, హేలాపురి బాలోత్సవం కమిటీ నాయకులు ఎస్.రవి, మైక్రో ఆర్టిస్ట్ డి.శివప్రసాద్ హజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన సభలో డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారతరత్న అవార్డులు పొంది 82 ఏళ్ల పాటు జీవించిన సివి.రామన్ కాంతి పరావర్తనం సైన్స్ అభివృద్ధిలో ఎంతో తోడ్పడిందన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి



చైతన్య సభలో మాట్లాడుతున్న వక్తలు


గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 12 రోజుల కార్యక్రమం నిత్యజీవితంలో సైన్స్ ఉపయోగం వివరించారు. ఎఆర్ డిజికె ఉన్నత పాఠశాలలో బోఫ్ నాయకులు జి.రాంబాబు, హేలాపురి బాలోత్సవం కమిటీ సభ్యులు ఎస్.రవి మాట్లాడుతూ విజ్ఞానంతోనే జగత్తు వికసిస్తుందని, విద్యార్థులు నూతన ఆవిష్కరణ కోసం ప్రయత్నం చేయాలని కోరారు. గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి స్టాఫ్ సెక్రటరి శ్రీనివాసరావు, ఎఆర్ డిజికె హైస్కూల్లో జరిగిన సభకు హెడ్‌మాస్టర్ డివిఎ.బబ్లు అధ్యక్షత వహించారు. ఆయా పాఠశాలల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు..!

ప్రజా ప్రతినిధులు, ప్రజల ఆవేదన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు శిలాఫలకాలపై నమోదు చేసే పేర్ల విషయమై ప్రోటోకాల్ పాటించకపోవడంతో ఆయా గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు మదన పడుతున్నారు. మండలంలోని శ్రీహరిపురం, కోమర్రు, కాకరవాడ గ్రామాలకు గ్రామ సచివాలయాన్ని శ్రీహరిపురం గ్రామంలో నిర్మించారు. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణ పనులు పూర్తి చేశారు. 2022లో గ్రామ సచివాలయ భవనాన్ని అప్పటి కైకలూరు ఎంఎల్ఏ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. శిలాఫలకంపై కోమర్రు సర్పంచి కె.శ్రీసాయికృష్ణ, కాకరవాడ సర్పంచి కాగిత రామారావు పేర్లు లేకుండా శిలాఫలకం ఏర్పాటు చేశారు. శ్రీహరిపురంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి అప్పటి ఎంఎల్ఏ డిఎన్ఆర్ ప్రారంభించారు. ప్రారంభించిన భవనాల శిలాఫలకంలో శ్రీహరిపురం సర్పంచి వరదా విశ్వేశ్వరావు పేరు మాత్రమే నమోదు చేసి కోమర్రు, కాకరవాడ సర్పంచుల పేర్లు లేకుండా ఏర్పాటు చేశారు. తమ పేర్లు శిలాఫలకంపై లేకపోవడంపై ఆయా



సచివాలయ శిలాఫలకంపై లేని సర్పంచుల పేర్లు

గ్రామాల సర్పంచులు మదన పడుతున్నారు. ఈ విషయమై కోమర్రు సర్పంచి శ్రీసాయికృష్ణ ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించారు. అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా ఉద్దేశపూర్వకంగానే తమ పేర్లు నమోదు చేయలేదని ధ్వజమెత్తారు. సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకంపై అధికారులు పూర్తి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ప్రజలు చెబుతున్నారు. ఇటీవల కాకరవాడ సర్పంచి కాగిత రామారావు అనారోగ్యంతో మరణించారు. శ్రీహరిపురం సచివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో రెండు గ్రామాల సర్పంచుల పేర్లు నమోదు చేయకపోవడంపై ఆయా గ్రామ ప్రజలు, మదనపడుతూ గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏదైనా ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసే శిలాఫలకంలో సర్పంచుల పేర్లు నమోదు చేయకపోవడంపై మండలంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. శిలాఫలకంలో కావాలనే సర్పంచి పేర్లు నమోదు చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా శ్రీహరిపురం సచివాలయ భవనం శిలాఫలకం మీద రెండు గ్రామాల సర్పంచుల పేర్లు నమోదు చేయాలంటూ ఆయా గ్రామాల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఇలాంటి సంఘటనలు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అధికారులపై ఉంది.